సాక్షి తిరుపతి

గురువారం । 14 । మార్చి । 2024



పచ్చమూకలపై ప్రజాగ్రహం

గీతాంజలి మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మహిళా లోకం నినదించింది. కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టింది. - 8లో



ఎన్నికలకు పకడ్బందీ భద్రత

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. - 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం (ఉ)
తిరుపతి	6-26	5-02
గూడూరు	6-27	4-53

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో ప్రవేశానికి దరఖాస్తులు



శేఖర్, డీఈఓ

తిరుపతి అర్బన్/ తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. 6, 11వ తరగతుల్లో ప్రవేశాలతోపాటు 7, 8, 9 తరగతుల్లోను ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు. అనాథలు, బడి బయట బాలికలు, డ్రాపౌట్లు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బీసీలు, మైనారిటీలు, వలస కార్మికులు, తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఉన్న పిల్లలు అర్హులుగా పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 1.20లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.40 లక్షలు ఉన్న కుటుంబాల్లో విద్యార్థినుల సైతం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తిగలవారు ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు తీసుకుని, ఆన్‌లైన్‌లో సమర్పించాలని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఆర్జీఈ టోల్ ఫ్రీ నంబర్ 18004258599లో సంప్రదించాలని కోరారు.

స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు (25 కేవీ సామర్థ్యం) 180, సోలార్ సీటీ మీటర్స్ 500, సీటీ మీటర్స్ 200, ఐఆర్‌డీఏ స్కానర్స్ 42 వచ్చాయని పేర్కొన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్ తీసుకోవచ్చని తెలిపారు. సకాలంలో పరికరాలను వినియోగదారులకు ఇవ్వాలని ఆయన సూచించారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం



మురళీరెడ్డి, జనరల్ సెక్రటరీ

తిరుపతి అర్బన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలోని పలు విభాగాల కమిటీలను బుధవారం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన కె.మురళీరెడ్డికి జనరల్ సెక్రటరీ, ఎస్‌ఎం సురేష్‌కు జాయింట్ సెక్రటరీ పదవులు దక్కాయి. అలాగే రాష్ట్ర మైనారిటీ విభాగంలో షేక్ ఖాదర్ బాషాకు అధికార స్పోక్స్‌పర్సన్, ఎస్‌డీ అబ్దుల్ గఫూర్‌కు సెక్రటరీగా అవకాశం లభించింది.

మహిళా వర్సిటీకి క్వాలిటీ ఆడిట్ సర్టిఫికెట్

తిరుపతి సిటీ: విద్యతోపాటు అన్ని విభాగాల పనితీరులో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న మహిళా వర్సిటీకి క్వాలిటీ ఆడిట్ సర్టిఫికెట్ దక్కింది. వీసీ భారతి మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పురస్కారం సాధించేందుకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిదంపతుల అభయం



ధ్వజావరోహణం చేస్తున్న అర్చకులు



పురవీధుల్లో విహరిస్తున్న శివపార్వతులు



కనులపండువగా కేడిగ వాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామిఅమ్మవార్లకు కనులపండువగా కేడిగ వాహనసేవ నిర్వహించారు. విశేష అలంకరణలో దేదీప్యంగా విరాజిల్లుతున్న ఆదిదంపతులను కేడిగ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- శైవాగమోక్తంగా ధ్వజావరోహణం
- నేడు పల్లకీసేవ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ముందుగా నూతన వధూవరులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల ఉత్సవమూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. ఆదిదంపతులకు విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ క్రమంలో సూర్య పుష్కరిణి వద్ద త్రిశూలానికి ఆగమోక్తంగా అభిషేకం చేశారు.

శాస్త్రోక్తంగా కలశోద్వాసన

ఉత్సవాల్లో భాగంగా రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శైవాగమన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా స్వామివారి గర్భాలయం వద్ద ధ్వజస్తంభానికి త్రిశూలంతో పాటు జ్ఞానప్రసూనాంబ సమేత సోమస్కంధమూర్తి ఉత్సవమూర్తులకు సంకల్ప పూజలు చేపట్టారు. అనంతరం ధ్వజస్తంభం నుంచి ధ్వజ పటం, దవళవస్త్రంతోపాటు భక్తులు సమర్పించిన చీరలను కిందకు దింపారు. ధ్వజస్తంభ



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పీఠానికి అభిషేకం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. యాగశాలలో ఏర్పాటు చేసిన యాగ కల



త్రిశూలంతో సూర్య పుష్కరిణికి వస్తున్న వేద పండితులు

శాలను ఉద్వాసన చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి ధ్వవమూర్తులకు అభిషేకం చేశారు. రాత్రి 10.30గంటలకు స్వామి అమ్మవార్లు సింహాసనం, కామధేనువు వాహనాలపై పురవీధుల్లో ఊరేగారు. కార్యక్రమాల్లో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈక్రమంలో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

అబద్ధాలకు కేరాఫ్ బాబు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడు : రాష్ట్రంలో అబద్ధాలకు కేరాఫ్ చంద్రబాబు అని, ఎన్నికలు వస్తే బురిడీ హామీలతో ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తుంటారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం వాకాడులో గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మాయమాటలను ప్రజలు గుర్తించారని, అందుకే 2019 ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పారని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పట్ల అత్యంత నిబద్ధతతో ఉంటారని, అందుకే ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే అమలు చేయడం ప్రారంభించి, పూర్తిస్థాయిలో నెరవేర్చారని వివరించారు. సీఎం వైఎస్ జగన్ మాట చెప్పారంటే.. అది తప్పకుండా చేస్తారని కొనియాడారు. అదే చంద్రబాబు ఏనాడూ మాట మీద నిలబడలేదని, ఇప్పుడు మళ్లీ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే చిత్తశుద్ధి, సత్తా ఒక్క సీఎం జగన్‌కే ఉందని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలతోపాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించారని తెలిపారు. సుపరిపాలన కొనసాగాలంటే ప్రజలు మళ్లీ ఆశీర్వదించి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీ గురుమూర్తి విన్నపం మేరకు నిడిగుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గం సమన్వయకర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నిబద్ధతతో పనిచేస్తున్నందుకే తగిన గుర్తింపు దక్కిందని తెలిపారు. పదవులు పొంది, పక్కకు వెళ్లిన వారిలా కాకుండా సంస్కారవంతంగా రాజకీయం చేస్తామని వెల్లడించారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వాకాడు వద్ద స్వర్ణముఖినదిపై నిర్మించిన బ్యారేజీకి దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పేరు ప్రతిపాదించాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, పార్టీ కళ్యాణదుర్గం పరిశీలకుడు ఎంఆర్సీరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యానారాయణరెడ్డి, సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, కట్టా సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రౌతు రామకృష్ణ, ఊటుకూరు యామిని, ఏఎంసీ చైర్‌పర్సన్లు యమునమ్మ, నాగభూషణమ్మ, స్థానిక నేత కొడవలూరు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : జిల్లా సార్వత్రిక ఎన్నికల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌలిక వసతులు కల్పించామన్నారు. ఓటరు జాబితాలో తొలగింపులపై సీఈఓ ద్వారా గూడూరు నియోజకవర్గం నుంచి 538, సూళ్లూరుపేట- 605, వెంకటగిరి- 744, చంద్రగిరి- 1,680, తిరుపతి- 856, శ్రీకాళహస్తి- 571, సత్యవేడు నుంచి 76 అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. అభ్యర్థులు, పార్టీల నేతలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈఆర్ఓలు స్ట్రాంగ్‌రూంలకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్ఓ పెంచల కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ వరకు 6,7, 8 ఫారమ్స్ 11,516 పెండింగ్ ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎన్నికల నియమావళిపై ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్ అవగాహన కల్పించారు. సమావేశంలో ఈఆర్ఓలు అదితీసింగ్, నిశాంత్‌రెడ్డి, చంద్రముని, కిరణ్ కుమార్, రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధే మా అభిమతం



- చిత్తశుద్ధితో ప్రజాసేవ చేస్తున్నాం
- పిచ్చి రాతలను పట్టించుకోం
- అభినయ్ ఆలోచనతోనే మాస్టర్ ప్లాన్ రోడ్లు
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

"అభివృద్ధే మా అభిమతం.. స్వార్థం లేకుండా చిత్తశుద్ధి ఉంటేనే ప్రగతి సాధ్యం.. ప్రపంచం చూశాం.. పూర్తిగా చదివాం.. గాలివాటు రాజకీయాలు చేయం.. తిరుమల శ్రీవారి మీద ప్రమాణం.. మాస్టర్ ప్లాన్ రోడ్ల వద్ద వంద అంకణాలు కూడా లేదు మాకు స్థలం.. అభివృద్ధి జరుగుతుంది. ప్రపంచాన్నంతా చూసిన వాళ్లం.. చదువుకున్న వాళ్లం.. పిచ్చి రాతలు రాసే పత్రికలకు ఎందుకు భయపడతాం.. ఎంత ఎక్కువగా రాస్తే అంత ఎక్కువ పనిచేస్తాం.. భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తే మరింత గట్టిగా పనిచేసే స్వభావం.. మమ్మల్ని ఆపడం కాదు ఎవరి తరం.. అభినయ్ ఆలోచనల ఫలితమే మాస్టర్ ప్లాన్ రోడ్ల సమాహారం" అని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు.



మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రారంభోత్సవ సభకు విచ్చేసిన అశేష ప్రజానీకం

సాక్షి, తిరుపతి/ మంగళం : తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భాగంగా బుధవారం 100 అడుగుల కులశేఖర ఆళ్వార్ మార్గం (కాటన్ మిల్ 100 అడుగుల రోడ్- 1.4 కిలోమీటర్లు), 80 అడుగుల గోదాదేవి మార్గం(టీఎస్ పాళెం 80 అడుగుల రోడ్- 2.2కిలోమీటర్లు)తోపాటు నేతాజీ, భగత్ సింగ్, ఆజాద్, రాజ్‌గురు విగ్రహాలను టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ భూమన్, మేయర్ శిరీష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ఆలోచనంతా భూమన అభినయ్‌దేనన్నారు. మొదట అభినయ్‌ని తానే నిరుత్సాహ పరిచానని, తర్వాత అభివృద్ధిని అలా చూస్తూ ఉండిపోయామని తెలిపారు. తానొక కొత్త సాఫ్ట్‌వేర్‌ని అంటూ అభినయ్ మాట్లాడిన మాటలను ఇప్పటికే రెండు కోట్ల మంది చూశారన్నారు. తిరుపతి అభివృద్ధి గురించిరెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు మాట్లాడుకునే పరిస్థితికి తీసుకొచ్చామని చెప్పారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల గురించి సన్నిహితులకు కూడా ఎప్పుడూ చెప్పలేదని, తామంటే గిట్టని పత్రికలు పిచ్చి రాతలు రాస్తే భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రోడ్లకు తమ పేర్లు పెట్టుకోలేదని, స్వాతంత్ర్యం కోసం ఉరి కొయ్యలకు ఊగిన యోధుల విగ్రహాలనే పెట్టించామని వెల్లడించారు. శ్రీవారికి అనన్య సేవలు అందించిన భక్త శిరోమణులు, స్వామి సేవకుల పేర్లనే రోడ్లకు పెట్టామని తెలిపారు. త్వరలో అల్లూరి సీతారామ రాజు విగ్రహాన్ని కూడా పెడుతున్నట్లు తెలియజేశారు. అనంతరం శ్వేత డైరెక్టర్ భూమన్, మేయర్ శిరీష తదతరులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. రెండేళ్ల వ్యవధిలోనే అకుంఠిత దీక్షతో తిరుపతిని దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దిన ఘనత అభినయ్‌కే దక్కుతుందన్నారు. కుల, మతాలకు అతీతంగా సమాజహితం కోరి, మంచి పనులు చేస్తున్నారంటూ కొనియాడారు. తిరుపతికి ఐటీ కంపెనీలను తీసుకువచ్చేందుకు భూమన అభినయ్ నిరంతరం పరితపిస్తున్నారని కార్పొరేటర్లు తెలిపారు.



శిలాఫలకం ఆవిష్కరణలో టీటీడీ చైర్మన్ భూమన తదితరులు



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన, సమన్వయకర్త అభినయ్, మేయర్ శిరీష

క్లుప్తంగా

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


లక్ష్మీప్రియాంక (ఫైల్)

ఏర్పేడు : మండలంలోని వికృతమాలలో యువతి అదృశ్యంపై బుధవారం ఫిర్యాదు అందినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. స్థానిక నీలాద్రి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న శ్రీనివాసరావు, సునీత కుమార్తె లక్ష్మీప్రియాంక(22) రేణిగుంట మండలంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. మంగళవారం కంపెనీకి వెళ్లిన యువతి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా కనబడక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9440900729 నంబరుకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రాజేంద్రన్ మృతదేహం

పిచ్చాటూరు : మండలంలోని కీళపూడి పాల్ట్రీ కాంప్లెక్స్ వద్ద బుధవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. నింద్ర మండలం కొప్పేడుకు దళితవాడకు చెందిన రాజేంద్రన్ రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు రోడ్డుపై రాజేంద్రన్ మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చమూకలపై ప్రజాగ్రహం

సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్న సైకోలపై ప్రజాగ్రహం పెల్లుబికింది.. మహిళలను అసభ్య పదజాలంతో వేధిస్తున్న టీడీపీ, జనసేనకు చెందిన మానవ మృగాలపై నిరసన వెల్లువెత్తింది.. ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించినందుకు ఓ ఆడబిడ్డను వెంటాడి వేధించి ప్రాణాలను హరించడంపై మహిళాలోకం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.. పచ్చమూకల పైశాచికత్వానికి బలైన గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలంటూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు చేపట్టింది.. ఈ క్రమంలోనే తిరుపతి ఎస్వీయూలో పెద్దసంఖ్యలో యువత కదం తొక్కింది. గీతాంజలి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

– తిరుపతి సిటీ/తిరుపతి అర్బన్

- గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి
- సోషల్ మీడియా సైకోలపై చర్యలు చేపట్టాలి



తిరుపతిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

అబల ప్రాణాలు వదిలింది



ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరుపై ఓర్వలేక ఇలాంటి దారుణాలకు దిగుతున్నారు. మహిళాశక్తి...మహిళలే తమ ఇంటి ఆడపడుచులంటూ చిలక పలుకులు పలికే ప్రతిపక్ష నేతలు నేడు గీతాంజలి కుటుంబానికి ఏమని సమాధానం చెబుతారు. ఆ కుటుంబం నరకయాతనకు కారకులైన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలి. బాధితులకు సరైన న్యాయం చేయాలని కోరుతున్నాం. – నారాయణరెడ్డి, మాజీ రిజిస్ట్రార్ సింహపురి యూనివర్సిటీ


ర్యాలీకి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

గుణపాఠం కావాలి



సోషల్ మీడియా అల్లరి మూకలకు గీతాంజలి మృతి గుణపాఠం కావాలి. మరణానికి కారణమైన ఉన్మాదులను బహిరంగంగా ఉరితీస్తే కానీ...ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా ఉంటాయి. ప్రభుత్వం తనకు అందించిన పథకాలను సంతోషంగా చెప్పుకోవడం తప్పుగా భావించి శిక్ష విధిస్తారా...నిందితులు ఏ పార్టీవారైనా ఉపేక్షించకూడదు. – రెడ్డమ్మ, నేషనల్ రైట్స్ ఆఫ్ డిజేబుల్ మహిళా సంఘం స్టేట్ సెక్రటరీ

వికృత చేష్టలను అరికట్టాలి



సోషల్ మీడియాతో పాటుగా వివిధ రకాలుగా మహిళలను కించ పరచడం చూస్తుంటే మనసు చలించిపోతోంది. ప్రభుత్వం ఎన్ని శిక్షలు అమలు చేస్తున్నప్పటికీ వీరిలో మార్పు రావడం లేదు. సోషల్ మీడియాలో వేధింపులకు గీతాంజలి ఆత్మ హత్య చేసుకుని మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. సోషల్ మీడియాలో వికృత చేష్టలను అరికట్టాలి. – తిరుమలశెట్టి శిరీష, గిరిజన యానాది సమాఖ్య మండల మహిళా కన్వీనర్, చిల్లకూరు

టీడీపీ, జనసేన బాధ్యత వహించాలి



గీతాంజలి మృతికి ప్రధాన కారకులు టీడీపీ, జనసేనకు చెందిన సోషల్ మీడియా నడుపుతున్న వ్యక్తులే. మహిళల పక్షపాతులమంటూ మాయమాటలు పలికే చంద్రబాబు ,పవన్‌కల్యాణ్ ఈ విషయంపై స్పందించకపోవడం దారుణం. సిటింగ్ జడ్జితో ఆమె మృతిపై పూర్తి విచారణ చేయిస్తే అసలు నిందితులు బయటకు వస్తారు. – వి.రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

వేధించి చంపారు



గీతాంజలి మరణంపై పలు అనుమానాలున్నాయి. రాజకీయ పార్టీల పేరుతో సోషల్ మీడియా ఉన్మాదులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సహించరాని నేరం. ఎంతో మంది మహిళలు రాష్ట్రంలో సోషల్ మీడియా వికృత చేష్టలకు బలైపోతున్నారు. ప్రభుత్వం ఆమె మరణానికి కారకులను వెంటనే గుర్తించి తగు చర్యలు చేపట్టాలి. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి. – హేమలత, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

కఠినంగా శిక్షించాలి



సోషల్ మీడియా వేదికగా మహిళలు తమ సొంత అభిప్రాయాలను వెలిబుచ్చడం నేరమా..అందుకు మరణశిక్ష విధిస్తారా...గీతాంజలికి జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదు. ప్రభుత్వ పథకాలు అందాయని చెబితే అల్లరిమూకలు అభాండాలు మోపి, ఆమె మృతికి కారణమయ్యారు. పోలీసులు, తక్షణం నిందితులను అరెస్ట్ చేశాలి. కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలి. – సాయిలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి, తిరుపతి

హేయమైన చర్యలు



ప్రతిపక్ష నేతల వికృత చేష్టలు కారణంగానే తెనాలిలో గీతాంజలి బలవన్మరణం చెందింది. ప్రభుత్వ పథకాల ద్వారా తమకు లబ్ధి చేకూరిందని, సొంత ఇంటి కల నెరవేరిందని చెప్పడమే ఆమె చేసిన తప్పా. సమాజంలో స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం మహిలలకు లేదా. ప్రతిపక్ష పార్టీలు పెంచి పోషిస్తున్న సోషల్ మీడియా సైకోలవి హేయమైన చర్యలు. గీతాంజలి మృతికి కారణమైన వారికి కఠినంగా శిక్షించాలి. – ధనియాల రాధమ్మ, మహిళా పవర్ సేవా సంస్థ అధ్యక్షులు, వెంకటగిరి

సభ్యసమాజం తలదించుకోవాలి



గీతాంజలి మృతిపై సభ్య సమాజం సిగ్గుతో తల దించుకోవాలి. ఆమె తనకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇంటి పట్టా వచ్చిందని, ఇతర సంక్షేమ పథకాలు అందాయని, తద్వారా తన కుటుంబానికి మంచి జరిగిందని యూట్యూబ్ చానెల్‌తో తన ఆనందాన్ని పంచుకోవడమే నేరమా. ఇది ఓర్వలేని కొందరు పనిగట్టుకుని అసభ్య కామెంట్లతో ఆమె వ్యక్తిత్వ హననానికి ఒడిగట్టారు. దీంతో వేధింపులకు ఆమె బలైపోవడం మహిళాలోకాన్ని ఉలికిపాటుకు గురిచేస్తోంది. నిందితులను కఠినంగా శిక్షిస్తే కానీ, ఆమె ఆత్మ శాంతించదు. – అరుణాదేవి, మహిళా సంఘం నేత, రేణిగుంట మండలం

'బాధ్యత'గా అంగన్‌వాడీ భవన నిర్మాణం

- శంకుస్థాపన చేసిన ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఎండీ

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ కాంపోనెంట్ తయారీ సంస్థ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా పరిశ్రమ వారు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)కింద అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ఈ మేరకు గొల్లవారిపాళెం గ్రామంలో రూ.29లక్షలతో చేపట్టనున్న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కంపెనీ ఎండీ తకావో ఇకరాషి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వ విద్యా సంస్థల మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు తమ సంస్థ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ చొరవను అభినందించారు. ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధిపై శ్రీసిటీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. నూతన భవనం నిర్మాణానికి సహకరించిన పరిశ్రమ యాజమాన్యానికి సర్పంచ్ పార్వతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు కోజి ఒగుమా, సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్, సాయి కృష్ణ , శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా సన్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి. రమేష్ కుమార్, మేనేజర్, సన్యాసయ్య పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న కంపెనీ ఎండీ తకావో ఇకరాషి తదితరులు

ఆధ్యాత్మికాభివృద్ధే అజెండా


మాట్లాడుతున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో బుధవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండాకు ఆమోదం తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ పాలకమండలి ఆమోదించిన విషయాలను వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

- సహస్ర లింగేశ్వరస్వామి (వేయిలింగాలకోన) ఆలయ జీర్ణోద్ధరణ, కుంభాభిషేకం నిర్వహించడం
- గిరి ప్రదక్షిణ మార్గంలో ఎదురుసేవ మండం వద్ద గణపతి ఆలయ పునర్నిర్మాణం
- ఏనుగులగుంట వద్ద స్వామిఅమ్మవార్ల విడిది మండపం పునర్నిర్మాణం
- గాలిగోపురం వద్ద సిమెంటు రోడ్డు నిర్మాణం
- భిక్షాల గాలిగోపురం నుంచి శ్రీరామ మందిరం వరకు రోడ్డు విస్తరణ, డివైడర్ ఏర్పాటు
- శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో ఉన్న స్వామి అమ్మవార్ల విడిది మండపం ఆధునికీకరణ.
- అమ్మవారి నెప్పల మండపం పునర్నిర్మాణం
- పట్టణంలో నూతన సైరన్ ఏర్పాటు
- భరద్వార తీర్థంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా పార్కుల ఏర్పాటు, తిరుమల తరహాలో మూడు నామాలు, నంది, సింహం కనపడేలా లైటింగ్ అమర్చేందుకు ముక్కంటి ఆలయ పాలకమండలి ఆమోదం తెలిపింది.

సమావేశంలో కమిటీ సభ్యులు కృష్ణయ్య, జయశ్యామ్, కృష్ణకుమార్, ప్రకాశం పంతులు, పసల సుమతి, జయమ్మ, లక్ష్మి, రమాప్రభ, చెంచులత, సునీత, భారతి, మల్లికార్జునరెడ్డి, సుబ్బరామగుప్తా, శ్రీనివాసులు, ఎక్స్అఫిషియో మెంబర్ శ్రీకాళహస్తీశ్వర గురుకుల్, ప్రత్యేక ఆహ్వానితులు సుబ్బారావు, పాండు, సుబ్రమణ్యం, శోభ, నీల, లీలావతి, పవన్, కాశి, ఉదయ్‌కుమార్, ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జునప్రసాద్, కృష్ణారెడ్డి, నూకరత్నమ్మ, శ్రీనివాసులురెడ్డి, సతీష్‌మాలిక్, శ్రీహరి, ధనపాల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత


మోనిష్‌రెడ్డికి కండువా వేస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కారణి గ్రామానికి చెందిన టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు నంబి మోనిష్‌రెడ్డి బుధవారం వంద మంది యువతతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, వేలూరురాకేష్, హరనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, గురవయ్య, రవిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 832 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని 87 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 832 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు మొత్తం 29,002 మందికి గాను 28,170 మంది హాజరైనట్లు వివరించారు. గురువారం ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చెట్టును ఢీకొన్న బైక్ : యువకుడి మృతి


మృతి చెందిన చైతన్య

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ వద్ద మంగళవారం రాత్రి బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. బిరదవాడ గ్రామానికి చెందిన వేముల చైతన్య (21) ఓ ప్రైవేట్ పరిశ్రమలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో డ్యూటీకి వెళ్లేందుకు బైక్‌పై వస్తుండగా మార్గం మధ్యలో కుక్క అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. దీంతో చైతన్య అక్కడికక్కడే మరణించాడు. ఎస్ఐ కామినేని గోపి ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్


తిరుపతిలో నిర్వహిస్తున్న ఫ్లాగ్ మార్చ్

తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఆదేశాల మేరకు కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. బీఎస్ఎఫ్, పోలీసు దళాలు సంయుక్తంగా బాలాయపల్లె, భాకరాపేట, తిరుచానూరు, తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కవాతు చేపట్టాయి.

కైలాసగిరులకు నిప్పు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని కైలాసగిరులకు బుధవారం కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో దిగువన తుపాను సెంటర్‌కు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అగ్నిమాపక అధికారులు, ఆలయ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఓ ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధుడిని రక్షించి బయటకు తీసుకువచ్చారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ గెరికనెట్టు, చల్లావారిపల్లె, సిద్ధయ్యగారి ఇండ్లు గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను ఏనుగుల గుంపు నాశనం చేసింది. ముఖ్యంగా వరి, మామిడి, కొబ్బరి, అరటి తోటలను ధ్వంసం చేసింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను మళ్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

ఆర్టీసీలో కాంట్రాక్ట్ పనులకు టెండర్లు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ డిపోల పరిధిలో పలు కాంట్రాక్ట్ పనులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్వీపింగ్, గ్యారేజ్ పనులు, బస్టాండ్, బస్సులు, టాయిలెట్స్ శుభ్రం చేయడం తదితర పనులు చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15వ తేది మధ్యాహ్నం 2 గంటల లోపు దరఖాస్తులను డీపీటీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ల బాక్స్‌లో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామని తెలిపారు.

ఎన్నికలకు పకడ్బందీ భద్రత


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్

తిరుపతి అర్బన్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్,ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే అమలు చేయాల్సిన నిబంధనలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈఆర్‌ఓలు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని చెప్పారు. పెండింగ్ ఫారమ్‌ల పురోగతి, తొలగింపులు, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు, జిల్లా కంట్రోల్ రూమ్,సోషల్ మీడియా సెల్ ఏర్పాటు, ఫిర్యాదుల నిర్వహణ , నివేదిక నిర్వహణ వ్యవస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుంచి జిల్లా నోడల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పలు నివేదికలు తదితర అంశాలను వివరించారు. ప్రతిరోజూ వార్తా పత్రికలు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, మొబైల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా మొదలైన వాటి నుంచి చెల్లింపుల వార్తలు, రాజకీయ ప్రకటనలపై నివేదికను ప్రతి అభ్యర్థికి సంబంధించి ఒక ఫార్మాట్‌లో ఆర్‌ఓతో పాటు వ్యయ పరిశీలన కాపీతో అకౌంటింగ్ బృందానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు,నగదు లక్ష రూపాయల పైన డ్రా చేసినా, పలువురికి ఒకే అకౌంట్ నుంచి లక్షరూపాలయ పైన పంపినా వాటిపై మానిటరింగ్ ఉంటుందని తెలిపారు. లిక్కర్ స్టాక్ బల్క్ గా నిల్వలు ఉండకూడదని, స్టాక్ పర్యవేక్షణ తప్పనిసరని సూచించారు. సమావేశంలో తిరుపతి ఈఆర్‌ఓ అదితీ సింగ్, అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఆర్‌ఓ పెంచలకిషోర్, ఈఆర్‌ఓలు నిశాంత్‌రెడ్డి, కిరణ్ కుమార్, రవి శంకర్ రెడ్డి, చంద్రముని, రామ్మోహన్, కలెక్టరేట్ ఎన్నికల తహసీల్దార్ చంద్ర శేఖర్, పవన్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ విశ్రాంత ఉద్యోగులు 4 వేల మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయడం గర్వంగా ఉందని... త్వరలోనే మిగిలి వారికీ ఇంటి పట్టాలు అందించేందుకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి కృషి చేస్తున్నారని టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఇలా విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాల పంపిణీ జరగలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌మోహన్‌రెడ్డి సహకారంతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కృషితోనే సాధ్యమైందని, ఇందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలని వివరించారు.

విభిన్న సంస్కృతుల సమ్మేళనం


కలెక్టరేట్ వద్ద త్రిపుర విద్యార్థులతో కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న తిరుపతి నగరం విభిన్న సంస్కృతుల సమ్మేళనమని కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కింద బుధవారం తిరుపతికి విచ్చేసిన త్రిపుర రాష్ట్రానికి చెందిన 45 మంది విద్యార్థులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్య, పర్యాటక, టెంపుల్, పారిశ్రామికహబ్‌గా తిరపతి జిల్లా ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. పునర్వ్యవస్థీకరణలో తిరుపతి జిల్లా ఆవిర్భవించిందని తెలిపారు. ఐఐటీ, ఐజర్, శ్రీసిటీ, కల్నరి ఇన్‌స్టిట్యూట్ తదితర ప్రముఖ విద్యాసంస్థలతోపాటు స్విమ్స్, టాటా స్వీకార్ క్యాన్సర్ ఆస్పత్రి, అరబిందో కంటి ఆసుపత్రి, బర్డ్ ఆస్పత్రిలో మెడికల్ హబ్‌గా విస్తరించిందని వివరించారు. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీకాళహస్తి రాహుకేతు క్షేత్రంతో టెంపుల్ హబ్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. శ్రీసిటీతోపే పారిశ్రామిక హబ్‌గా, షార్ కేంద్రంతో అంతరిక్ష పరిశోధనల కేంద్రంగా తిరుపతి జిల్లా ప్రముఖ స్థానం దక్కించుకుందని వివరించారు. సమావేశంలో అసోసియేట్ డీన్ (స్టూడెంట్ యాక్టివిటీస్) వసుధా రాణి దేవనాథన్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీ, ఐజర్ సీనియర్ ఇంజినీర్ శివకుమార్ కునా, డిప్యూటీ రిజిస్ట్రార్ హిమాన్షు శేఖర్ పాల్గొన్నారు.